## 14 వరకు 'రాజీవ్ యువ వికాస్' దరఖాస్తులు

జూబ్లీహిల్స్,ఏప్రిల్ 2: యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో ఈ నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. సర్కిల్‌లోని యూసుఫ్ గూడ, వెంగళరావునగర్, రహమత్ నగర్, బోర బండ, ఎర్రగడ్డ వార్డు కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం యూసీడీ, డీపీఓ వెంకట కిషన్‌రావు ఆయా వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత పత్రాలను ఆయా వార్డు కార్యాలయాల్లో సమర్పించాలని వారు కోరారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయని వారు వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని యూసీడీ డీపీఓ వెంకట కిషన్ రావు తెలిపారు.

## హంసధ్వని సంగీత పరిశోధనా అంశాలపై 12న శిక్షణా శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్. డాక్టర్ పావని, సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 2:సుప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో "హంస ధ్వని" సంగీత పరిశోధన అంశాల రూపకల్పనలో శిక్షణా శిబిరం 12న నిర్వహింపబడుతుందని సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్తలు నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరా హేమలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి చెందిన పోస్టర్ ను బుధవారం చిక్కడపల్లి లోని సమితి కార్యాలయంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సంగీత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పావని దుడ్డు, సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ శిబిరంలో సంగీత పరిశోధనా రంగంలో కొత్తగా అడుగుపెట్టిన విద్యార్థులు, అధ్యాపకులు, మరియు ఆసక్తిగల పరిశోధకులకు విశ్లేషణాత్మక ఆలోచన, సరైన శోధనా అంశాల ఎంపిక, పరిశోధనా విధానాలు, మరియు సమాచార సేకరణ విధానాలు వంటి అంశాలపై ప్రాముఖ్యతనిచ్చి వివరంగా అవగాహన కల్పించబడుతుందని తెలిపారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడండి

### జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేత



గంధంగూడ వాసులతో కలిసి జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు, పార్టీ నాయకులు

బండ్లగూడ, ఏప్రిల్ 2: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు అన్నారు. బుధవారం గంధంగూడ వాసులతో కలిసి జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బండ్లగూడలో నీటి సమస్య మరింత పెరిగిందన్నారు. జంట జలాశయాలలో ఒకటైన హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందించి కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్యను పరిష్కరిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. నేడు నీటి ఎద్దడిని నివారించలేకపోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి వనరులను పెంచి వేసవికాలంలో సైతం నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్న ఘనత తమదే అన్నారు. హిమాయత్ సాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రింటర్ల ద్వారా కొంతమేర నీటిని అందించినప్పటికీ ఆ నీరు ఏ మూలాన సరిపోకపోవడంతో ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సామర్థ్యాన్ని పెంచి బండ గూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని కాలనీలో గ్రామాలకు రోజు విడిచి రోజు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.



## ఆకట్టుకున్న భక్త చింతామణి నాటకం

ఫిలింనగర్‌లోని రామానాయుడు కళామండపంలో పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరుగుతున్న పద్య నాటక మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఖమ్మంకు చెందిన సుమిత్రా యూత్ అసోసియేషన్ కళాకారులు భక్త చింతామణి నాటకం ప్రదర్శించారు. బిల్వ పాత్రలో కె.శ్రీనివాసరావు, రాధగా లహరి, చింతామణిగా నెల్లూరి భానుమతి, భవానీగా కె. రామ్‌కుమార్, చిత్రగా గుడివాడ కుమారి, సుబ్బిశెట్టిగా ఎస్. రోశిరెడ్డి తదితరులు తమ నటనతో ఆకట్టుకున్నారు. నేటితరం సినీ, టీవీ కళాకారులకు నాటి రంగస్థల నాటకాల గొప్పతనాన్ని తెలియజేసేందుకు, రంగస్థల నటులను ప్రోత్సహించేందుకు నాటకోత్సవాలను ఏర్పాటు చేశామని నిర్వాహకుడు వెంకట సుబ్బారావు తెలిపారు. – బంజారాహిల్స్, ఏప్రిల్ 2

## లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



హిమాయత్ నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట లక్ష్మణ్

హిమాయత్ నగర్, ఏప్రిల్2: హెచ్‌సీయూ భూముల వివాద ఘటనలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్, రాజ్‌బహదూర్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్టంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ భూముల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నదని, ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు.శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటికే పలువురి విద్యార్థి నాయకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారని తెలిపారు.ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం అంటూ ఒక వైపు చెబుతూ, మరోవైపు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు.

యూనివర్సిటీ మొత్తం పోలీసుల వలయంలో చిక్కుకున్నదని, తక్షణమే పోలీస్ బలగాలను వెంటనే వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి,నేతలు అరుణ్, హరీష్, సందీప్, కృష్ణ, సాయి, వెంకటేష్, శ్రావణి, ఆకాశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

కవాడిగూడ, ఏప్రిల్ 2: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమికకారోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు 12 రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలను ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో బుధవారం ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వారికి తప్పనిసరిగా టీకాలు వేయించాలని చెప్పారు.

## పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి



జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన బీసీ బిల్లుకు మద్దతు తెలుపుతున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ బీసీ ఉద్యోగులు

వ్యవసాయ యూనివర్సిటీ : తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అసెంబ్లీలో బిల్లు పెట్టినా, పార్లమెంట్లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు సమావేశాలు రెండు రోజులు ఉండగానే బిల్లు పెట్టకపోవడంతో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీల మహాధర్నా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘాల అధ్యక్షులతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ బీసీ ఉద్యోగులు భిక్షపతి, అధ్యక్షులు కృష్ణ రజినీకాంత్ కె కిషన్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్నారు.



## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి..

సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని బోరబండలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సైట్ 2 కాలనీలోని పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. – ఎర్రగడ్డ, ఏప్రిల్ 2:

## చిట్టీల వ్యాపారి పుల్లయ్య నివాసం వద్ద ఉద్రిక్తం

అమీర్‌పేట్, ఏప్రిల్ 2: ఎస్సార్ నగర్ పరిసరాల్లో చిట్టీల ఫైనాన్స్ వ్యాపారాలు చేసి వందలాది మందికి కోట్లాది రూపాయల మేరకు కుచ్చుటోపీ పెట్టి ఉడాయించిన పుల్లయ్యను బుధవారం సాయంత్రం సీసీఎస్ పోలీసులు బీకేగూడలోని ఆయన నివాసానికి విచారణ నిమిత్తం తీసుకువచ్చారు. పుల్లయ్యను బీకే గోడలోని నివాసానికి పోలీసులు తీసుకువస్తున్నట్లు సమాచారం అందుకున్న బాధితులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసం వద్ద గూమిగూడారు. దీంతో పుల్లయ్య నివాస పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొన్నది. సీసీఎస్ పోలీసులు భారీ బందోబస్తు మధ్య పుల్లయ్యను ఆయన నివాసానికి తీసుకువచ్చి విచారించారు. ఆగ్రహావేశాలతో ఉన్న బాధితులు పుల్లయ్యపై దాడి చేయవచ్చనే అనుమానంతో ఎస్సార్‌నగర్ పోలీసులు పుల్లయ్య నివాసం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీఎస్ పోలీసులు తమ విచారణను ముగించిన తర్వాత పుల్లయ్యను సీసీఎస్‌కు తరలించారు.



పుల్లయ్య నివాసం వద్ద గుమికూడిన బాధితులు



## భక్తులకు ఇబ్బందులు లేకుండా..

హనుమాన్ ఆలయం నాలుగో వార్షికోత్సవాన్ని ఆలయ నిర్మాణదాత బుక్క వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణదాత మాట్లాడుతూ హైదరాబాద్ సమీపంలో శంషాబాద్ మండలం నర్కూడ అమ్మపల్లి దేవాలయం ఎదురుగా ఆంజనేయ స్వామి గుడిని నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆలయాన్ని దర్శించుకోవడం కోసం ప్రతి రోజు వందల సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. బుక్క వేణుగోపాల్ దంపతుల ఆధ్వర్యంలో మాడపారాధన, శ్రీమన్యాసుస్తా హోమం, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నానవాల కుమార్,నాగేష్‌గౌడ్, మెండే కుమార్‌యాదవ్, బూర్కుంట భాస్కర్, మల్లేష్ యాదవ్,కిట్టులతో పాటు పలువురు నాయకులు భక్తులు పాల్గొన్నారు. – శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2 :

## ఓయూలో రాహుల్‌గాంధీ చిత్రపటం దహనం



రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఓయూ పరిపాలన భవనం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ తమ భూములను వేలం వేయకూడదని హెచ్సీయూ విద్యార్థులు, అధ్యాపకులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై లాఠీచార్జి చేయడమేంటని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎటువంటి ఆందోళనలు చేయకూడదంటూ అధికారులు సర్క్యులర్ జారీ చేయడాన్ని ఖండించారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నోరెత్తితే రాజ్యాంగం అంటూ మాట్లాడే రాహుల్‌కు ఇప్పుడు నోరెందుకు రావడంలేదని ఎద్దేవా చేశారు. ఇందిరాగాంధీ ప్రారంభించిన యూనివర్సిటీ భూములను ఆ పార్టీకి చెందిన సీఎం లాక్కుంటూ, అడ్డుకుంటున్న విద్యార్థులపై పోలీసులచే పాశవికంగా దాడి చేపిస్తున్నారని వాపోయారు.

## మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు న్యాయం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో త్వరలో జరగబోయే క్యాబినెట్ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు కేటాయించాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 42 లక్షల జనాభా కల్గిన మాదిగలకు ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం దారుణం అన్నారు. తార్నాక లోని జేఏసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ మాదిగలకు ఎంపీ, ఎమ్మెల్యే పదవుల్లో కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మాలలకే అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. చివరకు మంత్రి వర్గంలో కూడా ఆరుగురు మాదిగ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఒకరికి కూడా అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలకు అన్యాయం చేస్తే జాతి చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. వర్గీకరణ చట్టం పేపర్లు మాదిగలకు, మంత్రి పదవులు, ఉద్యోగాలు మాలలకా అని ప్రశ్నించారు. ఇది ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ మాలల పార్టీ అవుతుందని అన్నారు.

## దేశవ్యాప్తంగా కుల గణన జరగాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 : దేశవ్యాప్తంగా కుల గణన జరగాలని, జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి రిజర్వేషన్ దక్కాలని వడ్డెర సంఘం తెలంగాణ లక్ష్య సాధన రాష్ట్ర అధ్యక్షులు, ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీల పోరుగర్జన మహా ధర్నా జరిగింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్లతో సత్యనారాయణ, తెలంగాణ గన్ను దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిరి అంతయ్య, మిగతా సంఘం నాయకులుమహా ధర్నాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, అంతయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక ఎన్నికల విద్య ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం కూడా బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెరిపేటి రాజు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పూలే, అంబేద్కర్ జన జాతర

చిక్కడపల్లి, ఏప్రిల్ 2: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పూలే అంబేద్కర్ జనజాతర కార్యక్రమాన్ని నేటి నుంచి 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని. ఏప్రిల్ నెలలోమహనీయుల మాసంగా నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు తెలిపారు. బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో పురోభివృద్ధి చెల్లినప్పటికీ నేటికీ కుల వివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో కుల వివక్షత పై ప్రతిఘటన పోరాటాలు చేస్తూ వస్తున్నామని తెలిపారు. పూలే అంబేద్కర్ జన జాతరలో భాగంగా ఏప్రిల్ ఒకటి నుంచి కు 10 వరకు గ్రామ గ్రామాన కులవివక్ష పై అధ్యయనం చేస్తామని తెలిపారు, 11న పూలే జయంతి నుండి 14 అంబేద్కర్ జయంతి వరకు పూలే అంబేద్కర్ జన జాతర సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏం దశరథ్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, నాయకులు కృపాసాగర్, కుంటి లక్ష్మణ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు మృతి

### ఆదుకోవాలంటూ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన



మృతి చెందిన కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో చోటు చేసుకున్నది. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పాలమాకుల గ్రామానికి చెందిన కృష్ణ(37) అదే గ్రామ పంచాయతీలో 20 ఏండ్లుగా వాటర్‌మేన్‌గా పని చేస్తున్నాడు. అయితే ఇటీవల కార్మికుడు తీవ్ర అనారోగ్యానికి గురై మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు, స్థానికులు అతడి ఇంటికి చేరుకొని శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం ఉదయం పంచాయతీ కార్మికులు అధికారులకు సమాచారం ఇచ్చి అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. దీంతో పంచాయతీ అధికారులు తాము ఆదుకోలేమని తేల్చిచెప్పడంతో కార్మికుడి మృతదేహంతో పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు సామేల్, పవన్‌కుమార్‌లు అక్కడికి చేరుకొని కార్మికులకు మద్దతుగా ఆందోళన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పంచాయతీల్లో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి ప్రభుత్వమే(పంచాయతీ నిధుల నుంచి) ఇన్స్‌రెన్స్ చేయిస్తుంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులకు ఇన్స్‌రెన్స్ చేయకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి నెలకొన్నట్లు వారు ఆరోపించారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం చేసేవరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదని తేల్చిచెప్పడంతో శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్ అక్కడికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. కార్మికుడి మృతిపై శంషాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్తాం

### నందారం సీతారాం మాదిగ



మంద కృష్ణ మాదిగను కలిసిన ఎంఎస్‌పీ నాయకులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 2: ఎస్సీ వర్గీకరణ సాధకుడు ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ను పలువురు నాయకులు కలుసుకున్నారు. ఏం ఎస్ పి సీనియర్ నాయకుడు నందారం సీతారాం మాదిగ, మెట్టుగూడ ఆటో ప్రకాష్ మాదిగలు ఎస్సీ వర్గీకరణ సాధకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలకు మభ్యపెట్టి తీవ్రమైన అన్యాయం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై రాబోయే ఎలక్షన్లలో ఓటు అనే ఆయుధంతో మాదిగ ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, మాలలకు ఉద్యోగాలు దోచిపెట్టిన రేవంత్ రెడ్డి మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం మాదిగలపై రేవంత్ రెడ్డి కి ఉన్న విపక్షత తేటతెల్ల మైందని,రాబోయే ఎలక్షన్ లో గుండు సున్నా కి పరిమితం చేసి మాదిగల సత్తా చాటుతామని నందారం సీతారాం మాదిగ హెచ్చరించారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, ఏప్రిల్ 2: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్ లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రజలు బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిని పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు రాజు సానుకూలం గా స్పందించి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

## మల్లేపల్లిలో దోమల నివారణకు చర్యలు

మెహిదీపట్నం ఏప్రిల్ 2 : ప్రజలకు దోమలతో ఇబ్బందులు లేకుండా చేయడానికి జీహెచ్ఎంసీ సర్కిల్ – 12 ఎంటమాలజీ విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి లో బుధవారం ఇంటింటికి వెళ్లి రసాయనాలను పిచికారీ చేయించారు. దోమల లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తించి రసాయనాలను పిచికారీ చేశారు. ప్రజలకు దోమల వల్ల ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు.

## శివాలయ పరిసరాల్లో రోడ్డు వేయాలి..

బాలానగర్, ఏప్రిల్ 2 : ఫతేనగర్ డివిజన్, శివాలయం పరిసరాల్లో రోడ్డు వేయాలని కోరుతూ స్థానికులు బుధవారం కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం స్థానికుల కోరిక మేరకు శివాలయం రోడ్డులో కార్పొరేటర్ సతీశ్ గౌడ్ పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికుల విజ్ఞప్తి మేరకు శివాలయ పరిసరాల్లో సరైన రోడ్డు మార్గం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు.

## వేర్వేరు చోట్ల పలువురు అదృశ్యం



సుమతమ్మ (ఫైల్)

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2 : ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన భార్య తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దగోల్కొండ గ్రామానికి చెందిన మిదింటి సుమతమ్మ(36) భర్త గోపాల్‌తో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నెల రోజుల క్రితం భర్తకు చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన భార్య ఇప్పటి వరకు తిరిగిరాలేదు. దీంతో భర్త గోపాల్ చుట్టు పక్కల బంధువుల వద్ద ఎక్కడ వెతికినా ఫలితం దక్కలేదు. దీంతో ఆమె భర్త బుధవారం శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### యువతి అదృశ్యం



అనూష (ఫైల్)

యువతి అదృశ్యమైన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చౌదర్‌గూడ గ్రామానికి చెందిన మల్చలం సిద్ధులు కూతురు అనూష(23) మంగళవారం ఇద్దరు కలిసి ఇంట్లో ఉన్నారు. తల్లి మంజుల మధ్యాహ్నం 1 గంట సమయంలో శంషాబాద్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. సాయంత్రం 4 గంటల సమయంలో కూతురు కనిపించడంలేదని భర్త సిద్ధులు భార్య మంజులకు సమాచారం ఇచ్చారు. వారు ఎక్కడ వెతికినా ఫలితం లేదు. దీంతో కుటుంబ సభ్యులు శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### సంసారం విషయంలో మరో వ్యక్తి..



పవన్ (ఫైల్)

సంసారం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవపడి భర్త అదృశ్యమైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నెల రోజుల క్రితం బిహార్ రాష్ట్రానికి చెందిన కే పవన్ (43) అతడి భార్య చందుదేవి ఇద్దరు కలిసి బతుకుదెరువు కోసం శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో భర్త మూత్రవిసర్జనకు వెళ్తున్నట్లు చెప్పి బయటికి వెళ్లి ఉదయం వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె బుధవారం ఉదయం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.